క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో రాజార్షికి సిల్వర్ మెడల్



హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఎస్వీఆర్ పాఠశాల విద్యార్థి శీలం రాజార్షి.. సిల్వర్ మెడల్ సాధించాడు. ఇటీవల హైదరాబాద్‌లోని షేక్‌పేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాజర్షి పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు కోచ్ నరేంద్ర దేవ్ తెలిపారు. ఈమేరకు హసన్‌పర్తి జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో రాజర్షిని శుక్రవారం పలువురు అభినందించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఎస్వీఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శివకుమార్, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దమ్మ నర్సింహారాములు, బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ శీలం పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ అకాడమీకి 'ఇన్ఫంట్' విద్యార్థి ఎంపిక



వరంగల్: నగరంలోని 14వ డివిజన్ రెడ్డిపాలెంలోని ఇన్ఫంట్ జీసస్ కాన్వెంట్ హైస్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థి కె.అక్షిత్.. వాలీబాల్ అకాడమీకి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ కృపామరియా, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హన్మకొండ చౌరస్తా: రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.5వేల కోట్లు ప్రభుత్వం కేటాయించేలా చూడాలని తెలంగాణ రెడ్డి జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర కమిటీ సమావేశం హనుమకొండలోని అశోకా హోటల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా రెడ్డి కులంలోని పేదలకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. సమావేశంలో రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, బాధ్యులు మర్రి యాదవరెడ్డి, రావుల నర్సింహరెడ్డి, రెంటాల కేశవరెడ్డి, రాదారపు సంజీవరెడ్డి, దాసరి కేశవరెడ్డి, నల్ల రాజిరెడ్డి, జైహింద్ రెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణ చిత్ర నటుడికి స్వాగతం

మడికొండ: కర్ణ చిత్ర నిర్మాత, డైరెక్టర్, హీరోగా నటించిన కళాధర్‌కు మడికొండలో స్థానికులు ఘనస్వాగతం పలికారు. మడికొండ గ్రామానికి చెందిన కొక్కొండ కళాధర్.. కర్ణ సినిమా నిర్మాతగా, డైరెక్టర్‌గా, హీరోగా నటించి మొదటిసారి మడికొండకు వచ్చిన సందర్భంగా ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కొప్పుల నవీన్‌యాదవ్, కార్తీక్, వినయ్‌కుమార్, బాలరాజు, అరవింద్, రాకేష్, నరేష్, దండిగం రాజుయాదవ్, విక్రమ్, వైకుంఠం, భాస్కర్, విష్ణు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు



సాక్షి స్పందన

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ ఫోర్ట్‌రోడ్డు విద్యానగర్ కాలనీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టారు. విద్యానగర్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి అనే శీర్షికన సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి శంభునిపేట విద్యుత్ శాఖ డీఈ మల్లికార్జున్, ఏడీ సర్వేశ్వర్, ఏడీఈ, ఏఈ సంపత్‌కుమార్, లైన్‌మెన్ రఘు, సిబ్బంది స్పందించారు. అచ్చ వినోద్‌కుమార్, రాంప్రసాద్, నాగరాజు, జక్కన్న, లక్ష్మి, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు రక్తదాన శిబిరం



కాజీపేట: తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన ఎల్‌జీ సంస్థ ప్రతినిధులు అభినందనీయులని రెడ్‌క్రాస్ సంస్థ ఉపాధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ ప్రశంసించారు. కాజీపేట పట్టణంలో ఎల్‌జీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 51 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ కోలా శ్రీధర్, మార్కెటింగ్ మేనేజర్ ఎండీ షాహిద్ బేగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు





డీఐఈఓ గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు, పీడీఎస్‌యూ నాయకులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ నిబంధనలు పాటించని హనుమకొండలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను మూసివేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్ కృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ ఎంఈఓ కార్యాలయంలో సిబ్బంది వేణుగోపాల్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా బ్రాంచీలు కూడా ఓపెన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బాధ్యులు గణేష్, సాయి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఇంటర్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆలువాల నరేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలో డీఐఈఓ గోపాల్‌ను కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టనున్నట్లు ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, సతీష్, నితిన్, సంతోష్, ఎండీ.అజహర్, గణేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాల

హనుమకొండలోని వడ్డేపల్లి ప్రాంతంలో ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తోందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి ఓర్స చిరంజీవి, జిల్లా కమిటీ సభ్యుడు మాటూరి సతీష్ తెలిపారు. ఈమేరకు ఆ కళాశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఐఈఓ గోపాల్‌కు నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఒకచోట గుర్తింపు తీసుకొని అదే బ్రాంచీ పేరుతో మరో మూడు చోట్ల నడుపుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని వారు తెలిపారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటా..



కార్మికుడికి బెనిఫిట్లు అందిస్తున్న చీఫ్‌విప్

హన్మకొండ: కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కార్మిక శాఖ ద్వారా మంజూరు అయిన మ్యారేజీ బెనిఫిట్‌ను హనుమకొండ సర్క్యూట్ హౌస్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కార్మికుడు నల్ల అవినాష్‌కు అందించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ భవన, నిర్మాణ సంక్షేమ మండలి ద్వారా అనేక మందికి లబ్ధి చేకూరుతోందని వివరించారు. నియోజకవర్గంలో 20వేల మందికి లేబర్ కార్డులు అందజేసినట్లు చెప్పారు. వాటి ద్వారా 9 వేల మందికి ఇప్పటికే లబ్ధి చేకూరిందని గుర్తుచేశారు. భవన, నిర్మాణ, దాని అనుబంధ 54 రంగాల కార్మికులకు సభ్యత్వ నమోదుకు అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ బాధ్యుడు కేశోజీ ప్రణయ్, కార్మిక నాయకులు పుల్ల శ్రీనివాస్, ప్రవీణ్, సాయిని రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



హన్మకొండ చౌరస్తా: ముదిరాజ్ జాతిని దుర్భాషలాడుతూ, వీడియో జర్నలిస్టుపై దాడి చేయడంపై ముదిరాజ్ కులస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను శుక్రవారం హనుమకొండ చౌరస్తాలో దహనం చేశారు. 24 గంటలలోపు ముదిరాజ్ కులస్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండలోని మచిలీబజార్, ఏనుగులగడ్డ, గుడిబండల్‌కు చెందిన ముదిరాజ్ కుల పెద్దలు పులి మధు, భయ్యా శోభన్, చింతాకుల ప్రభాకర్, పైడి, సుక్కయ్య, ప్రభాకర్, రవీందర్, సాగర్, హరికృష్ణ, సందీప్, ప్రవీణ్, ప్రకాష్, ముదిరాజ్ కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేశాడని నిరసన

వరంగల్ అర్బన్: వరంగల్ పెద్దమ్మగడ్డకు సమీపంలో కేసీఆర్ కాలనీ, కాపువాడలలోని స్థలాలను అమ్మి తమను ఓ వ్యక్తి మోసం చేశాడని భూ బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం ఎదుట బల్దియా రిటైర్డ్ ఉద్యోగి ధర్మరాజు, మహంతు సంతోష్ కుమార్, జనార్దన్, రంగయ్య నిరసన తెలిపారు. బెదిరింపులకు పాల్పడుతున్న ఆ వ్యక్తి నుంచి తమను కాపాడి న్యాయం చేయాలని కోరారు.

గుడిసెవాసులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, తదితరులు

హసన్‌పర్తి: ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు హసన్‌పర్తి డిప్యూటీ తహసీల్దార్ రహీంకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాములు మాట్లాడుతూ హసన్‌పర్తి మండల పరిధిలో సుమారు వేయి నిరుపేద కుటుంబాలు సర్కార్ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లా అశోక్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సుచందర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సతీష్, నాయకులు భిక్షపతి, మౌనిక, లత, సుస్మిత, అనిఫా, అజిమా, గుడిసెవాసులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్సన్

హన్మకొండ అర్బన్: మడికొండలోని డంపింగ్ యార్డు కారణంగా కాజీపేట మండలంలోని పలు గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఈనెల 15న జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్ తెలిపారు. దీనిపై స్పందించిన కమిషన్.. 8 వారాల్లో సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. ఈమేరకు డీసీసీ నాయకుడు మహమ్మద్ అంకుస్‌తో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్సన్ మాట్లాడారు. డంపింగ్ యార్డులోని కాలుష్యం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర శ్వాసకోస వ్యాధులతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాజీపేట అర్బన్: అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. కాజీపేటలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, గృహలక్ష్మి పథకం కింద రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య, శ్రీకాంత్, రాజేందర్, గడ్డం అశోక్, జంపాల రమేష్, శ్వేత, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ యజమానికి ఫైన్



జరిమానా విధిస్తున్న అధికారులు

కాశిబుగ్గ: 18వ డివిజన్ లేబర్‌కాలనీ ఏంఎస్‌కే ఎలైట్ బార్ అండ్ రెస్టారెంట్‌లో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంతో రూ.5 వేల జరిమానా విధించినట్లు బల్దియా శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి తెలిపారు. బార్‌లో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని కొందరు వినియోగదారులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. దాంతో లేబర్‌కాలనీలోని బార్ అండ్ రెస్టారెంట్‌లో గురువారం సాయంత్రం తనిఖీ చేసినట్లు తెలిపారు.

బీరన్న బోనాలను విజయవంతం చేయాలి

కరీమాబాద్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న నిర్వహించనున్న బీరన్న బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని బీరన్నస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ కోరె కృష్ణ కోరారు. ఆలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కురుమ సంఘం ఆధ్వర్యంలో ప్రతీఏటా కనులపండువగా బీరన్నకు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని గుర్తుచేశారు. ఈసారి కూడా వేడుకలను వైభవంగా జరుపుతామని తెలిపారు. కార్పొరేటర్లు పల్లం పద్మ, మరుపల్ల రవి మాట్లాడుతూ బీరన్న బోనాల సందర్భంగా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కోరె నాగరాజు, నరిగె లక్ష్మణ్, దయ్యాల పురుషోత్తం, రాజు పాల్గొన్నారు.

బీరన్నస్వామి దేవస్థాన కమిటీ ఎన్నిక

కరీమాబాద్‌లోని బీరన్నస్వామి దేవస్థాన కమిటీ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కోరె కృష్ణ, ఉపాధ్యక్షుడిగా కడారి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కోరె నాగరాజు, సహాయ కార్యదర్శిగా దయ్యాల సుధాకర్, కోశాధికారిగా నరిగె లక్ష్మణ్, ఆర్గనైజర్లుగా నంద నవీన్, కుండె క్రాంతికుమార్, గొట్టె సదానందం, కార్యవర్గ సభ్యులుగా మండల జంపయ్య, నరిగె శ్రీనివాస్, కంకల శంకర్, వాసూరి శ్రీనివాస్, మురికి రాజు, కంచ తిరుపతి, కాటం సతీష్, కోరె రమేష్, బండారి అరవింద్, కొమ్ము రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా కంకల మల్లేషం, కోరె కుమారస్వామి, బండారి రాజేశ్వర్, మండల కొమురెల్లి ఎన్నికయ్యారు.

సైబర్ నేరాలు, సామాజిక భద్రతపై అవగాహన



గ్రామీణ మహిళలతో అధికారులు, తదితరులు

మామునూరు: సైబర్ నేరాలు, సామాజిక భద్రతపై గ్రామీణ ప్రాంత మహిళలు అవగాహన పెంచుకోవాలని ఐఎస్ఏసీ రిటైర్డ్ వింగ్ కమాండర్ శ్రీనివాస్, ఎల్‌క్యూబ్ సొల్యూషన్ ఫౌండర్ రమ పట్నాయక్ సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జీ–20, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా, హైదరాబాద్, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, సమాచార భద్రతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ ఇంటర్నెట్ వాడకం ఎక్కువైన క్రమంలో చాలామంది సైబర్ నేరాల బారిన పడుతున్నారని తెలిపారు. ఈక్రమంలో గ్రామీణ ప్రాంత మహిళలు, విద్యార్థినులు తమ వివరాలు గోప్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతిరావు, హెడ్స్ డాక్టర్ సత్యవతి, డాక్టర్ తన్వీర్ జహన్, డాక్టర్ అయేషాబాను, పున్నేలు సర్పంచ్ దేవేందర్‌గౌడ్, బ్యాంక్ అధికారులు అనిల్, ప్రశాంత్, అధ్యాపకులు సలీమ్, జీవాని, మహేష్, పల్లవి, మహేశ్వరి, ఆశ వర్కర్లు, రమణ కుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ జీవితం ఆదర్శం



మొక్క నాటుతున్న వెంకటరమణ, నాయకులు

వరంగల్: డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జీవితం ఆదర్శం అని వరంగల్ తూర్పు బీజేపీ నేత డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు. బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని దేశాయిపేట రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ముఖర్జీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఏక్ దేశ్ మే దో నిశాన్, దో ప్రధాన్, దో విధాన్ నహీ చలేగా అంటూ అఖండ భారతావని కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప నాయకుడు, జన సంఘ్ వ్యవస్థాపకుడు ముఖర్జీ అని గుర్తుచేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జన్ను సుబ్రహ్మణ్యం, దోమల భవానీశంకర్, పులిచేరి ఉపేందర్, చింతం రాజు, లక్ష్మణ, అపురూప రజనీష్‌నేత, సర్దార్ గోవింద్‌సింగ్, వంగ సంపత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్‌లో..

ఖిలా వరంగల్: భరతమాత ముద్దుబిడ్డ, రాజనీతిజ్ఞుడు, భారతదేశ ఐక్యత, సమగ్రతను కాపాడే దిశగా పోరాడిన డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని బీజేపీ నేత గంట రవికుమార్ అన్నారు. బలిదాన్ దివస్ సందర్భంగా ఖిలా వరంగల్ పడమర, మధ్యకోటలో బీజేపీ నేతల ఆధ్వర్యంలో ముఖర్జీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద్రమోహన్, అరుణ్, శ్రీను, రాజు, ప్రవీణ్, కిరణ్, మున్నా, మూర్తి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే మోదీ ధ్యేయం



కరపత్రాలు అందిస్తున్న ధర్మారావు, స్వాతి

హన్మకొండ: అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా హనుమకొండ రాంనగర్‌లో ఇంటింటికి శుక్రవారం వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలు అందించారు. అనంతరం ధర్మారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రంలో అమలు కాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చాడా స్వాతి, బీజేపీ నాయకులు చాడా శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్, రమేష్, శీలం ప్రవీణ్, ఠాగూర్ సబిన్‌సింగ్, తిరమలేష్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చిర్ర నర్సింగ్‌గౌడ్ సూచించారు. ఇంటింటికి బీజేపీ అనే నినాదంతో కాజీపేట పట్టణంలో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.చాంద్ పాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గృహలక్ష్మి పథకంలో రూ.6లక్షలు ఇవ్వాలి

వరంగల్: ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకంలో చేపట్టనున్న ఇంటి నిర్మాణానికి రూ.6లక్షలు ఇస్తూ అర్హులైన వారందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. స్థలం లేనివారికి ఇంటి స్థలం ఇచ్చి ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3లక్షల మాత్రమే ఇవ్వాలని నిర్ణయించడం పేదవారిని దగా చేయడమేనని పేర్కొన్నారు. డబుల్ బెడ్రూం ఇల్లు కట్టిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు సొంత ఇంటి స్థలం ఉన్నవారికి మూడు విడతల్లో రూ.3 లక్షలు ఇస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని తెలిపారు.

విద్యార్థుల సైకిల్ ర్యాలీ

మడికొండ: జన బాగి దారి కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మడికొండలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాఠశాల నుంచి శుక్రవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు పూర్వ గణిత భావనల ద్వారా వారికి గణితం పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హెచ్‌ఎం సంధ్యారాణి తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, కవిత, మల్లేశ్వరి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోపీగౌడ్

హన్మకొండ: తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా శ్రీపతి గోపీగౌడ్‌ను నియమించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యాలయంలో శ్రీపతి గోపీగౌడ్‌కు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు గోపి కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

హన్మకొండ కల్చరల్: శాకంబరి ఉత్సవాల్లో భాగంగా హనుమకొండలోని హనుమద్గిరి పద్మాక్షిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని కాకరకాయ, ఆపిల్‌పండ్ల మాలలతో అలంకరించి లక్ష్మీ సహస్రనామాలతో అర్చనలు నిర్వహించారు. వరంగల్ ఎంజీఎం సమీపంలోని రాజరాజేశ్వరి దేవాలయంలో అర్చకుడు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని వాహ్నివాసినిగా అలంకరించి లలితాసహస్ర నామ పారాయణం చేశారు. ఆలయ చైర్మన్ వి. వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

శాకంబరి అలంకరణలో లలితాదేవి

ఖిలా వరంగల్: ఆషాఢ మాసం సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో లలితాదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన పూజారి వెంకటేశ్వరచార్యులు ఆధ్వర్యంలో లలితాదేవిని పలు రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. కార్యక్రమంలో మంచాల కృష్ణమూర్తి, శ్రీరాం రాజేష్, రావికంటి అశోక్, ఆడెపు శ్యామ్, విమల, శైలజ, త్రివేణి, మంచాల రాణి పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో శతాధిక ఘటాభిషేకం

మడికొండ: వర్షాలు సంవృద్ధిగా కురవాలని కోరుతూ కాజీపేట మండలం మడికొండలోని మహంకాళి ఆలయంలో పూజారి మంత్రవాది వెంకటప్రసాద్ మంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో శతాధిక ఘటాభిషేకాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు జిజియాబాయి, విజయ, రాజేశ్వరి, పుష్పలత, స్వరూప, రాజ్యలక్ష్మి, సంధ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జరిమానా

రామన్నపేట: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై వరంగల్ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడిన నలుగురికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.4,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ బాబులాల్ తెలిపారు. అలాగే, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 15 మందికి రూ.21,500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఆరుగురు మైనర్లను జువైనల్ కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేయగా ఐదుగురికి జువైనల్ మెజిస్ట్రేట్ ఒకరోజు బాలల అబ్జర్వేషన్ హోమ్‌కు పంపించినట్లు వివరించారు.

జువైనల్ హోంకు ముగ్గురు బాలుర తరలింపు

కాజీపేట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలు నడిపుతూ పట్టుబడిన ముగ్గురు బాలురను జువైనల్ న్యాయమూర్తి ఒకరోజు జువైనల్ హోంకు తరలిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. సీఐ కథనం ప్రకారం కాజీపేట పట్టణంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టగా మైనర్ బాలురు పట్టుబడగా వారిని కోర్టులో హాజరుపర్చారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 13 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కేయూ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ (కుక్టా) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు క్యాంపస్‌లోని పరిపాలన భవనం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోధ్, జేఏసీ కోకన్వీనర్ చందులాల్, ఉమెన్స్ కన్వీనర్ మధుశ్రీ, మధుకర్‌రావు, గడ్డం కృష్ణ, కల్పన, స్వప్న, చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి, చీకటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రి ఇంటి వద్ద కాంట్రాక్టు లెక్చరర్ల ధర్నా

తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గత కొద్దిరోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ యూనివర్సిటీల కాంట్రాక్టు లెక్చరర్లు హైదరాబాద్‌లో విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇంటి వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు, కన్వీనర్ సాదు రాజేష్, బాధ్యులు చిర్ర రాజు, మాదాసి కనకయ్య, అరూరి సూర్యం, రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పరశురాం పాల్గొన్నారు. రెగ్యులరైజేషన్‌పై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సబితా హామీ ఇచ్చారు.